భయం భయంగా..

- మఠం సెంటర్‌లో పొంచి ఉన్న ప్రమాదం
- నాలుగు నెలలు గడచినా నిర్మాణం కాని కల్వర్టు
- కాంట్రాక్టరే నిర్మాణం చేయాలని కౌన్సిల్
- మున్సిపల్ నిధులు ఖర్చు చేయాలని ఎమ్మెల్యే వర్గం
- ఇబ్బంది పడుతున్న ప్రజలు, వ్యాపారులు



మఠం సెంటర్‌లో ట్రాన్స్‌ఫార్మర్ వెనుక డివైడర్లు ఏర్పాటు చేసిన కల్వర్టు

సామర్లకోట: స్థానిక మఠంసెంటర్‌లో ప్రమాదం పొంచి ఉంది. కల్వర్టు నిర్మాణం లేకపోవడంతో ఎప్పుడు ఏం ముంచుకొస్తుందోనని ప్రజలు భయపడుతున్నారు. సమస్య కంటికి కనిపిస్తున్నా సుమారు నాలుగు నెలలు గడుస్తున్నా అధికారులు గానీ, ప్రజాప్రతినిధులు గానీ పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి.

సమస్య ఇదీ..

డ్రైన్లలో పూడిక తీత పనుల్లో భాగంగా మఠంసెంటర్‌లోని అంబటి కాంప్లెక్స్, ట్రాన్స్‌ఫార్మర్ ప్రదేశంతో కల్వర్టులను తొలగించారు. అయితే పూడిక తీత పనులు పూర్తయినా కల్వర్టులు నిర్మాణం జరుగకపోవడంతో ఎప్పుడు ఏమి ప్రమాదం జరుగుతుందోనని ఆ సెంటర్‌లోని అంబటి షాపింగ్ కాంప్లెక్స్ యజమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. షాపింగ్ కాంప్లెక్స్‌లో ఉన్న బ్యాంకుకు రాకపోకలు సాగించే వారికి ప్రమాదాలు జరుగకుండా కూల్చి వేసిన కల్వర్టుపై ఇనుప రేకులు ఏర్పాటు చేశారు. మిగిలిన షాపులకు వచ్చే వారి పరిస్థితిని గాలికి వదలి వేశారనే విమర్శలు ఉన్నాయి. అదే విధంగా మఠంసెంటర్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద కల్వర్టును కూల్చి వేయడంతో అక్కడ కూడా ప్రమాదం జరిగే అవకాశం ఉంది. ఈ విషయాన్ని గమనించిన మున్సిపల్ అధికారులు కల్వరు కూల్చిన ప్రదేశంలో ఇరువైపులా డివైడర్లను ఏర్పాటు చేశారు. మఠంసెంటర్‌లో ఉన్న బ్యాంకులు, కొత్తూరు నుంచి రాకపోకలు సాగించే వారు ట్రాన్స్‌ఫార్మరు వెనుక నుంచి దగ్గర మార్గం కావడంతో రాకపోకలు సాగించే వారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం మఠం సెంటర్ నిత్యం రద్దీతో ఉంటుంది. ఇక పండగల పర్వదినాల్లో అయితే చెప్ప నక్కర్లేదు. దీనికి తోడు భారీ వాహనాలు రాకపోకలు సమయంలో వాహనచోదకులు ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా సుమారు 10 అడుగుల లోతులో ఉన్న డ్రైనులో పడిపోయే ప్రమాదం ఉంది.



సామర్లకోట మఠం సెంటర్‌లో షాపుల వద్ద ప్రమాదంగా ఉన్న కల్వర్టు

గత నెల కౌన్సిల్ సమావేశంలో ఈ కల్వర్టు నిర్మాణంపై చర్చించారు. దీనిని అజెండాలో కూడా పెట్టారు. అయితే నిధుల మంజూరును కౌన్సిల్‌లో మెజార్టీ సభ్యులు వ్యతిరేకించారు. పట్టణ పరిధిలో సుమారు రూ.36 లక్షలతో పూడక తీత పనులు చేస్తున్న కాంట్రాక్టరు పూడిక తీసే సమయంలో తొలగించిన కల్వర్టును వానూ మళ్లీ నిర్మాణం చేయాలని కౌన్సిల్ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు. పూడిక తీతకు మాత్రమే కాంట్రాక్టు ఇచ్చారని, పనులు జరిగే సమయంలో అంతరాయంగా ఉన్న వాటిని తొలగించి వాటిని తిరిగి నిర్మాణం చేయడానికి మున్సిపాలిటీ నిధులు ఖర్చు చేయవలసి ఉంటుందని, అభివృద్ధిని అడ్డుకొంటున్నారని ఎమ్మెల్యే వర్గీయులు విమర్శిస్తున్నారు. పూడిక తీతలో అవకతవకలు జరగడం వలనే ఇటీవల కురిసిన కొద్దిపాటి వర్షానికే డ్రైన్లలో మురుగునీరు రోడ్లపై ప్రవహించిందనే ఆరోపణలు ఉన్నాయి.

వ్యాపారాలకు అంతరాయం



కల్వర్టును తొలగించి నాలుగు నెలలు కావడం వల్ల షాపులకు వచ్చే వారికి ఎప్పుడు ఏమి ప్రమాదం జరుగుతుందోనని భయపడవలసి వస్తుంది. నాలుగు నెలలుగా వ్యాపారాలు నిలిచిపోయాయి. అద్దెలు, షాపులలో పని చేసే సిబ్బంది వేతనాలు మాత్రం ప్రతి నెలా చెల్లివలసి వస్తోంది. కల్వర్టు నిర్మాణం పూర్తి చేసి షాపులకు మార్గం ఏర్పాటు చేసి ప్రమాదాలు నివారించాలి.

– వెంకటేష్, షాపింగ్ కాంప్లెక్స్ వ్యాపారి, సామర్లకోట

కాంట్రాక్టరే నిర్మించాలి



పట్టణ పరిధిలో పూడిక తీతకు ముందుకు వచ్చిన కాంట్రాక్టరే కూల్చివేసిన కల్వర్టులను తొలగించాలి. కల్వర్టులను తొలగించే ముందు కౌన్సిల్ అభిప్రాయం తీసుకోవాల్సి ఉండగా అది కూడా చేయలేదు. సొంత అభిప్రాయంతో కల్వర్టును కాంట్రాక్టురు కూల్చివేయడంతో నిర్మాణ బాధ్యతలు వారే తీసుకోవాలి. కౌన్సిల్ సభ్యులకు ఎటువంటి సమాచారం లేకుండా అజెండాలో నిధులు కేటాయిస్తూ చేర్చిన అంశాన్ని సభ్యులందరూ ఎందుకు ఆమోదిస్తారు. మున్సిపల్ సాధారణ నిధులు వృథా కాకుండా చూడాలి.

– ఉబా జాన్‌మోజెస్, మున్సిపల్ వైస్‌చైర్మన్, సామర్లకోట

కల్వర్టు నిర్మిస్తాం



మఠం సెంటర్‌లో దీర్ఘకాలికంగా ఉన్న పూడిక తీత పనులు చేయడానికి కల్వర్టును తొలగించ వలసి వచ్చింది. తొలగించిన కల్వర్టుల ప్రదేశంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని గుర్తించి డివైడర్ బోర్డులు ఏర్పాటు చేశాం. కూల్చి వేసిన కల్వర్టును నిర్మాణం చేయడానికి కాంట్రాక్టరు ముందుకు రావచ్చారు. త్వరలో కల్వర్టు నిర్మాణ పనులు ప్రారంభమవుతాయి.

– ఎ.శ్రీవిద్య, మున్సిపల్ కమిషనర్, సామర్లకోట

ఎన్‌సీసీతో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు



ఎన్‌సీసీ శిక్షణా సదస్సులో పాల్గొన్న గైనకాలజిస్ట్ విజయలక్ష్మి తదితరులు

పెద్దాపురం: ఎన్‌సీసీతో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు దేశభక్తితో పాటు సమాజంలోని సమస్యలపై అవగాహన పెరుగుతుందన్నారు. ప్రముఖ గైనగాలజిస్ట్ ఎ.విజయలక్ష్మి అన్నారు. స్థానిక జవహార్ నవోదయ విద్యాలయంలో ఎన్‌సీసీ వార్షిక శిక్షణా శిబిరంలో భాగంగా శుక్రవారం పీటీ, యోగసనాలు, హెచ్‌పీవీ వ్యాక్సిన్, క్యాన్సర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్, క్యాంప్ కమాండెంట్ మేజర్ కె.మహ్మద్ ఆఫీజ్ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ క్రమశిక్షణ, ఐక్యమత్యంతో పాటు స్పోర్ట్ స్పిరిట్ వంటి అంశాలపై అవగాహన కల్పించేందుకు ఎన్‌సీసీ శిక్షణ ఎంతగానో దోహదపడుతుందన్నారు. మహ్మద్ ఆఫీజ్ మాట్లాడుతూ నేటి విద్యార్థులను భావి భారత ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలన్నదే ఈ శిబిరం లక్ష్యమన్నారు. ప్రతీ శిక్షణాంశాన్ని ఏకాగ్రతతో నేర్చుకోవాలని, ముఖ్యంగా వెపన్ పట్టుకున్నప్పుడు, ఫైర్ చేసేటప్పుడు చాలా జాగ్రత్తగా ఉండాలన్నారు. ఈ శిబిరంలో ఫైరింగ్, వెపన్ ట్రైనింగ్, బాటిల్ ఫీల్డ్ అండ్ ఫీల్డ్ క్రాఫ్ట్, టెన్త్ పిచ్చింగ్, హెల్త్ అండ్ హైజిన్ తదితర అంశాలపై శిక్షణ ఇచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో సుబేదార్ మేజర్ ఆఫీసర్ హేమంత్‌కుమార్, లెఫ్టినెంట్ సత్యనారాయణ, ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మరిడమ్మకు పూజలు



బంగారు, వెండి పుష్పాలతో పూజలు అందుకుంటున్న అమ్మవారు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన పెద్దాపురం మరిడమ్మ అమ్మవారికి ప్రీతికరమైన శుక్రవారం బంగారు, వెండి పుష్పాలతో పాటు పంచామతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ విజయలక్ష్మిల ఆధ్వర్యంలో అమ్మవారి ప్రత్యేక అభిషేకాలు, చండీహోమం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

7 నుంచి ఉచిత సమ్మర్ క్యాంపు

పెద్దాపురం: స్థానిక చిల్డ్రన్ క్లబ్(పీసీసీ) ఆధ్వర్యంలో స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో వచ్చే నెల 7వ తేదీ నుంచి జూన్ 9వ తేదీ వరకు ఉచిత సమ్మర్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు పీసీసీ గౌరవాధ్యక్షుడు బుద్దా శ్రీనివాస్ తెలిపారు. సమ్మర్ క్యాంపునకు సంబంధించి పోస్టర్‌ను శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ పీసీసీ ఆధ్వర్యంలో వరుసగా నాలుగో సంవత్సరం సమ్మర్ క్యాంపు నిర్వహిస్తున్నామన్నారు. ఉదయం 6.30 నుంచి 8 గంటల వరకు కరాటే, సాయంత్రం నాలుగు గంటల నుంచి ఏడు గంటత వరకు వివిధ విభాగాల్లో శిక్షణ ఇస్తామన్నారు. సమ్మర్ క్యాంప్‌కు వచ్చే వారు మే 5వ తేదీ లోగా తమ పేర్లను రిజిష్టర్ చేసుకోవాలన్నారు. 79016 97939 నంబర్‌కు ఫోన్ చేసి రిజిష్టర్ చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ అధ్యక్ష, కార్యదర్శులు కూనిరెడ్డి అరుణ, రొంగల అరుణ్‌కుమార్, అమృత, సమత్ర, మణికంఠ, యోగేష్, నాని, బాల మురళీకృష్ణ, నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిగ్రస్తులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిది



వ్యాధిగ్రస్తులకు నిత్యావసర వస్తువులు అందజేస్తున్న ప్రవీణ్‌పాల్

పెద్దాపురం: కుష్టు వ్యాధి గ్రస్తులను అన్ని విధాల ఆదుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంటుందని మిరాకిల్ మినిస్ట్రీస్ అధినేత రెవరెండ్ డాక్టర్ ప్రవీణ్ పాల్ అన్నారు. స్థానిక మదర్‌థెరిసా కాలనీలో శుక్రవారం క్లాప్స్ అధ్యక్షుడు లంక పురుషోత్తమ్‌దాస్ అధ్యక్షతన వ్యాధిగ్రస్తులకు నిత్యావసర, కిరణా వస్తువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌పాల్ మాట్లాడుతూ తమవంతు సహాయ, సహకారాలు అందిస్తామన్నారు. 15 కేజీల బియ్యం, ఆయిల్, పంచదార, సర్ఫ్ సబ్బులు, కిరాణా సరకులను అందస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రసిడెంట్ జె.సుధాకర్, దార్ల విజయ్‌కుమార్, ఎలిజా, సీబీఐ సుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడిపై కత్తితో దాడి

కాకినాడ రూరల్: కాకినాడ ఎస్.అచ్యుతాపురం చిన్న అంబేడ్కర్ వీధిలో స్థల వివాదం నేపథ్యంలో ఇంట్లో నిద్రిస్తున్న యువకుడు కుక్కల నానిపై పక్కనే నివాసం ఉంటున్న పేంటి జాజి శుక్రవారం కత్తితో దాడికి పాల్పడ్డాడు. ఇంద్రపాలెం పోలీసులు వివరాల ప్రకారం.. స్థలం నిమిత్తం ఇరు కుటుంబాలు మధ్య కొంత కాలంగా ఘర్షణ జరుగుతుండడంతో ఇంట్లో నిద్రిస్తున్న నానిపై జాజి కత్తితో దాడి చేసి గాయపరిచాడు. తీవ్రంగా గాయపడిన నానిని కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో చేర్చారు. దీనిపై కేసు నమోదు చేసి, నిందితుడిపై చర్యలు తీసుకుంటామని ఇంద్రపాలెం ఎస్సై వీరబాబు తెలిపారు.

ప్రభుత్వ కళాశాలల్లో సమస్యలు పరిష్కరించాలి

ఎమ్మెల్యే గ్రీవెన్సులో మానవ హక్కుల సంఘ అధ్యక్షుడు



ఎమ్మెల్యే చినరాజప్పకు వినతిపత్రం అందజేస్తున్న జిల్లా మానవ హక్కుల సంఘ అధ్యక్షుడు అప్పలకొండ

సామర్లకోట: పట్టణ పరిధిలోని ప్రభుత్వ కళాశాల సమస్యలు పరిష్కరించాలని జిల్లా మానవ హక్కుల సంఘ అధ్యక్షుడు నూతలపాటి అప్పలకొండ అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఎమ్మెల్యే కార్యాలయంలో నిర్వహిస్తున్న గ్రీవెన్సులో వినతి పత్రం అందజేసినట్టు అప్పలకొండ చెప్పారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ 1972లో ప్రారంభించిన ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అనేక మంది డాక్టర్లతో పాటు ఉన్నత స్థాయిలో ఉన్న వారు ఉన్నారని, అయితే ఆ కళాశాలను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కళాశాల కు చెందిన భవనాలు శిథిల స్థితికి చేరుకోవడంతో ఎప్పుడు కూలిపోతాయోనని అధ్యాపకులు, విద్యార్థులు భయం భయంగా తరగతి గదులలో ఉంటున్నారని తెలిపారు. దీనిని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు నూతన తరగతి గదులతో భవన నిర్మాణం చేయాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వెళ్లినట్లు చెప్పారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, ఎంబైపీసీ, సీఈసీ, హెచ్ఈసీలతో పాటు ఒకేషనల్ కోర్సులు ఉన్నాయని సుమారు 500 మంది విద్యార్థులు చదువుతున్నారని అప్పలకొండ తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆధునాతన లేబరేటరీస్ ఉన్నాయన్నారు. అదే విధంగా స్థానిక బ్రౌన్‌పేటలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలను మూడేళ్ల క్రితం మహిళా జూనియర్ కళాశాలగా గుర్తించడం జరిగిందన్నారు. కళాశాల కోసం 12 తరగతి గదులు మంజూరు కాగా 4 తరగతి గదులు మాత్రమే నిర్మాణం చేశారని, మిగిలిన తరగతి గదులతో పాటు బాలిక జూనియర్ కళాశాలలో ల్యాబ్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు.

పన్నుపై రాయితీని సద్వినియోగం చేసుకోండి

బోట్‌క్లబ్: ఆస్తి పన్ను బకాయిలపై విధించిన వడ్డీపై 50 శాతం రాయితీ, 2025– 26 ఆర్థిక సంవత్సరం మొత్తం పన్ను ఒకే సారి చెల్లిస్తే 5 శాతం రిబేటును నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ భావన శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 30వ తేదీ వరకూ మాత్రమే తగ్గింపు ఉంటుందన్నారు. పన్ను చెల్లింపుల కోసం నగరంలో ప్రత్యేక కౌంటర్లు కూడా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. స్థానిక సినిమా రోడ్డులోని పాత మున్సిపల్ కార్యాలయం, శారద దేవి గుడి వద్ద ఉన్న మున్సిపల్ కార్యాలయం, వైద్య నగర్, రాజారామ్మోహన్‌నగర్, సీతారామ్‌నగర్, పావురాల తూము, యానాం రోడ్డు, తూరంగి పేట, న్యూ మున్సిప్ జంక్షన్, తిలక్ స్ట్రీట్, రామారావుపేట, మోహర్‌నగర్, నరసన్ననగర్, జట్ల పెదకాపు స్ట్రీట్‌లోని సచివాలయాల్లో పన్నులు చెల్లించేందుకు ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు.

త్రయంబకేశ్వరస్వామి కల్యాణం

కాకినాడ రూరల్: రమణయ్యపేట ఆర్టీసీ కాలనీలోని శివాలయం వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా పార్వతీ సమేత త్రయంబకేశ్వరస్వామి కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అర్చకుడు చైతన్య బృందం వేద మంత్రాలు నడుమ కల్యాణోత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించి, భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

ఐక్యతతో మెలగాలి

కాకినాడ రూరల్: కులమతాలకు అతీతంగా ఐక్యమత్యంతో మెలగాలని న్యాయవాది కొమ్మూరి శ్రీనివాసరావు పేర్కొన్నారు. మానవ ఐక్యమత్య దినోత్సవం పురస్కరించుకుని రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో మన అందరి మధ్య ఐక్యమత్యం అవసరమన్నారు.

వేసవి సెలవుల్లో ఆటలపై దృష్టి పెట్టాలి

ఎమ్మెల్యే, కౌడా చైర్మన్లు



విద్యార్థులకు ఖోఖో శిక్షణ

సామర్లకోట: విద్యార్థులు వేసవి సెలవుల్లో ఆటలపై దృష్టి సారించాలని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, కౌడా చైర్మన్ తుమ్మల బాలులు అన్నారు. స్థానిక బచ్చుఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన ఖోఖో, కబడ్డీ సమ్మర్ కోచింగ్ క్యాంపును వారు శుక్రవారం సాయంత్రం ప్రారంభించారు. సామర్లకోటకు కబడ్డీకి రాష్ట్ర స్థాయిలో మంచి పేరు ఉందని, పూర్వవైభవం తీసుకురావాలన్నారు. గ్రామీణ క్రీడలైన కబడ్డీ, ఖోఖోలపై దృష్టి సారించి సమ్మర్ క్యాంప్‌ను విజయవంతం చేయాలన్నారు. జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కొండపల్లి శ్రీనివాసు అధ్యక్షతన వహిస్తూ సమ్మర్ క్యాంప్‌కు 50 మందిని ఎంపిక చేశామన్నారు. కార్యక్రమంలో కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధులు నిమ్మకాయల కిరణ్, బడుగు శ్రీకాంత్, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ అడబాల కుమారస్వామి, రైతు సంఘ నాయకుడు కంటే బాబు, మాజీ మున్సిపల్ వైస్‌చైర్మను యార్లగడ్డ చిన్ని, పాఠశాల హెచ్ఎం తోటకూర సాయిరామకృష్ణ, ప్రోకబడ్డీ అంపైర్ బోగిళ్ల మురళీకుమార్, పీడీ తాళ్లూరి వైకుంఠం తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ మానవహారం

పెద్దాపురం: ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో మున్సిపల్ సెంటర్లో శుక్రవారం మానవహారం నిర్వహించారు. ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, కౌడా చైర్మన్ తుమ్మల రామస్వామి బాబు, రాజా సూరిబాబు రాజు, సామర్లకోట, పెద్దాపురం టీడీపీ, జనసేన, తదితర నాయకులు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ దాడికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ సెంటర్లో కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో బిక్కిన విశ్వేశ్వరరావు, సభ్యత్వాల నమోదు ఇన్‌చార్జి గొరకపూడి చిన్నయ్యదొర, బీజేపీ టౌన్ ప్రెసిడెంట్ రామ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థులకు సత్కారం



సామర్లకోట బచ్చుఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో ఉత్తమ విద్యార్థులకు సత్కారం

సామర్లకోట: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో స్థానిక బచ్చుఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను శుక్రవారం సాయంత్రం పాఠశాల హెచ్ఎం తోటకూర సాయిరామకృష్ణ ఆధ్వర్యంలో సత్కరించారు. పాఠశాలలో 95 మంది పరీక్ష రాయగా 77 మంది పాస్ కావడంతో పాటు 16 మంది 500 మార్కులు మించి సాధించారని హెచ్ఎం తెలిపారు. ఫస్టు క్లాసు 51 మందికి, సెకండ్ క్లాసు 14 మందికి రాగా 12 మంది థర్డు క్లాసులో పాసయ్యారని హెచ్ఎం వివరించారు. 585 మార్కుల నుంచి 508 మార్కుల వరకు వచ్చిన విద్యార్థులను మెమోంటోలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, కౌడా చైర్మన్ తుమల బాబు, వార్డు కౌన్సిలర్ బలుసు వాసు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఏటీఎల్ సమ్మర్ క్యాంపు పరిశీలన



విద్యాశాఖ రాష్ట్ర పరిశీలకులను సత్కస్తున్న ఎంఈఓలు

సామర్లకోట: స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో గండేపల్లి, ఉండూరు మల్లాం, కిర్లంపూడి, స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలల నుంచి ఎంపికైన విద్యార్థులకు అటల్ టింకరింగ్ ల్యాబ్(ఏటీఎల్) సమ్మర్ శిక్షణను విద్యాశాఖ రాష్ట్ర పరిశీలకులు టి.సుదర్శన్ శుక్రవారం సాయంత్రం పరిశీలించారు. ఫొటో టెక్నిక్స్, డిజైనింగ్ పెయింటింగ్‌లతో పాటు వివిధ సాంకేతిక అంశాలపై విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నట్టు మండల విద్యాశాఖాధికారి వై.శివరామకృష్ణయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం, క్యాంపు కోర్సు కోఆర్డినేటర్ యు.మీనామాధురి, ఏటీఎల్ నోడల్ ఇన్‌చార్జి కల్యాణ్‌చక్రవర్తి, ఎంఈఓ–2 పి.పుల్లయ్య, ఏటీఎల్ ల్యాబ్ ఇన్‌చార్జి టి.మహాలక్ష్మి ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర పరిశీల కులను ఎంఈఓలు సత్కరించారు.

మతిస్థిమితం లేని మహిళకు వస్త్ర ధారణ



మతిస్థిమితం లేని మహిళకు వస్త్ర ధారణ చేస్తున్న దృశ్యం

సామర్లకోట: మతిస్థిమితం లేని మహిళకు ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావు శుక్రవారం సాయంత్రం వస్త్ర ధారణ చేయించారు. గత కొన్ని నెలలుగా సామర్లకోట స్టేషన్ సెంటర్‌లో తిరుగుతున్న మతిస్థిమితం లేని మహిళ స్థానికులు పెడుతున్న అల్పాహారం, భోజనం తీసుకొని తింటూ జీవిస్తోంది. సుమారు మూడు నెలల నుంచి ఒకే చీరతో ఉండడంతో ఆ చీర చిరిగిపోవడాన్ని అతను గమనించి కొంత మంది మహిళలకు చీర ఇచ్చి ఆమెకు కట్టించే ప్రయత్నం చేయగా వారిని ఆమె దగ్గరకు కూడా రానివ్వలేదు. ఈ విషయాన్ని ట్రాఫిక్ ఎస్సై దృష్టికి తీసుకు వెళ్లడంతో మహిళా కానిస్టేబుల్ మరి కొంత మంది మహిళల సహాయంతో స్థానిక బసివిరెడ్డి సత్రం వద్ద మతిస్థిమితం లేని మహిళకు నైటీ ధరింపజేశారు. ఉన్నతాధికారుల దృష్టికి ఆమె పరిస్థితిని తీసుకు వెళ్లి మంచి అనాథాశ్రమంలో చేర్పిస్తామని ఎస్సై గరగారావు తెలిపారు.

వేగిపోతున్నారు..!

- వేసవి తాపంతో విజృంభిస్తున్న వ్యాధులు
- పనులకు దూరమవుతున్న కూలీలు
- జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యులు

పిఠాపురం: ఎండలు మండుతున్నాయి రోహిణీ కార్తె ఇంకా రాకుండానే ఎండల తీవ్రత పెరగడంతో ఇక వచ్చే రోజుల్లో పరిస్థితి ఎలా ఉంటుందోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలు భయాందోళనలు కలిగిస్తున్నాయి. రోడ్లన్ని నిర్మానుష్యంగా మారిపోతున్నాయి. వాహనదారులు అపసోపాలకు గురవుతున్నారు. ఈనేపథ్యంలో మరో పక్క సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. దీంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

డీహైడ్రేషన్‌కు గురై..

కొన్ని రోజులుగా ప్రచండ భానుడు ప్రతాపం చూపడంతో ప్రజలు విలవిల్లాడుతున్నారు. ముఖ్యంగా వేసవి తాపంతో జ్వరం, జలుబు, విరోచనాలు, వాంతులు వంటి వ్యాధులతో అనారోగ్యానికి గురవుతున్నారు. గ్రామాల్లో పారిశుధ్య లోపాలు లేకుండా చూస్తున్నప్పటికీ సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతుండడంతో ప్రజలు డీహైడ్రేషన్‌కు గురవుతున్నారు. ఎండ వేడికి శరీరంలో నీటి నిల్వలు తగ్గి మనిషులు తీవ్ర అస్వస్థతకు గురవుతున్నారు. దీంతో పలువురు వ్యాధుల బారిన పడుతుండడంతో పిఠాపురం నియోజకవర్గ పరిధిలో పలు ఆస్పత్రులు రోగులతో నిండిపోతున్నాయి. ఎక్కువగా వడదెబ్బ, జ్వరం, జలుబు, విరోచనాలు, వాంతులు వంటి వ్యాధులతోనే మంచాన పడుతున్నారు. పలువురు వ్యవసాయ కూలీలు సైతం వేసవి తాపానికి గురై నీరసించి ఆస్పత్రుల పాలవుతున్నారు.



వేసవి ప్రభావంతో నిర్మానుష్యంగా మారిన గొల్లప్రోలు ప్రధాన రహదారి



చెట్టు నీడకు చేరిన ఉపాధి కూలీలు

అందువల్ల జాగ్రత్తలు తీసుకోవాలి లేకపోతే ప్రమాదాలు సైతం సంభవించే అవకాశం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా వేసవి ప్రతాపానికి గురి కాకుండా పలుచని ఖద్దరు దుస్తులు మాత్రమే ధరించాలన్నారు.

వడదెబ్బకు గురైతే ఇలా చేయండి

ఎవరైనా వడదెబ్బకు గురైతే వెంటనే చల్లని ప్రదేశానికి తరలించి ఉప్పునీటి ద్రావణం తాగించాలన్నారు. అనంతరం వెంటనే దగ్గరలోని ఆస్పత్రికి తరలించి వైద్యసేవలు అందేలా చూడాలన్నారు. అధిక ఉష్ణోగ్రతల వల్ల శరీరంలో వివిధ రకాల లవణాలు తగ్గిపోయి నీరసం రావడంతో పాటు వివిధ రోగాలకు గురవుతారన్నారు. మధ్యాహ్నం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వేసవి తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున తప్పని సరిగా జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచించారు. అధికంగా నీటిని తాగుతూ కొద్దిపాటి జాగ్రత్తలు పాటించాలని చెబుతున్నారు.

పనులకు దూరమవుతున్న కూలీలు

ఎండ ప్రతాపంతో కూలీలు పనులకు వెళ్లేందుకు నిరాకరిస్తున్నారు. ఉదయం తొమ్మిది గంటల నుంచే వేసవి ప్రతాపం పెరిగిపోతుండడంతో ఎండకు తట్టుకోలేక జీవనోపాధిని సైతం వదులుకుంటున్నారు. చేలల్లో పనులకు వెళితే నీడనేదిలేక వడదెబ్బకు గురై ఆస్పత్రి పాలుకావాల్సి వస్తోందని కూలీలు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో రైతులు తమ వ్యవసాయ పనులను ఎక్కువగా యంత్రాలతోనే చేయిస్తున్నారు.

కొబ్బరి బొండాలు, తాటి ముంజులకు గిరాకీ

వేసవి తాపం నుంచి తక్షణం ఉపశమనం కలిగించే కొబ్బరి బొండాలకు, తాటి ముంజలకు గిరాకీ పెరిగింది. ఎక్కడ చూసినా కొబ్బరి బొండాలు, తాటి ముంజుల అమ్మకాలు జోరందుకున్నాయి. కూల్ డ్రింక్‌ల కంటే సహజ సిద్ధంగా పోషకాలు లభించే వీటిని తాగేందుకు తినేందుకు ప్రజలు బారులు తీరుతున్నారు.

జీజీహెచ్ అత్యవసర విభాగం ఆకస్మిక తనిఖీ



వైద్య సేవలను పరిశీలిస్తున్న డాక్టర్ విఠల్

కాకినాడ క్రైం: స్థానిక జీజీహెచ్‌లోని అత్యవసర విభాగాన్ని సూపరింటెండెంట్ డాక్టర్ ఎంపీఆర్ విఠల్ గురువారం అర్థరాత్రి ఆకస్మిక తనిఖీ చేశారు. రోగులతో మాట్లాడి అందుతున్న వైద్య సేవలను తెలుసుకున్నారు. పలు మంచాలపై ఇద్దరు రోగులు ఉండడం చూసి వైద్యులు, నర్సులకు సూచనలిచ్చారు. ఇకపై క్యాజువాలిటీలో మంచానికి ఇద్దరు చొప్పున రోగులను ఉంచొద్దని, తొలి దశ చికిత్స అందించి తక్షణమే వార్డుకు పంపాలని అన్నారు. ఈ ఆదేశాలు అమలయ్యేలా సీఎంవో పర్యవేక్షించాలన్నారు. అనంతరం పలువురి రోగుల విజ్ఞాపన మేరకు అత్యవసర విభాగంలో ఉన్న వార్డుల్లో సదుపాయాలను పరిశీలించి సమస్యల పరిష్కారానికి ఆదేశాలిచ్చారు.